కథానిక

# ఎవరి బ్రదుకు మధురం?

అవసరాల రామకృష్ణారావు

ఛీ, పాడుబ్రతుకు- ఈ ఆడబ్రతుకు బ్రతికే కన్నా చస్తే మంచిది. ఆరింటికల్లా వస్తారు, ఆఫీసులో పెద్ద పని చేసారంటూను. ఏం గీసినా, నాలుగు గీతలే కదూ. ఈ దిక్కుమాలిన పొగలో చచ్చీ చెడీ, వండేసరికల్లా, ఆవురావురుమని సింహంలా వస్తారు. నా కష్టం ఆయనకేం తెలుస్తుంది! చీవాట్లూ, సాధించడం తప్ప. తెల్లవారు ఝామున లేచింది మొదలు పడుకోబోయే దాకా చాకిరేయే కదా! ఆయనకేం మహారాజు లాగ తొమ్మిదింటికల్లా హాయిగా ఇంత అన్నం తిని నీటుగా తెల్లని బట్టలు వేసుకొని రాజాలా వెళతారు. అదృష్టం వెయ్యిజన్మాలకేనా మొగ జన్మ ఇయ్యి భగవంతుడా!

* * *

పొద్దుట 9 గంటల్నుంచి సాయంకాలం 6 దాకా రాత, రాత, రాత! దిక్కుమాలిన రాత చస్తున్నాను. దానికేం, హాయిగా ఒక అరగంటలో వండేస్తుంది. ఏ వెంకమ్మతోనో సుబ్బమ్మతోనో కబుర్లు చెప్పుకుంటూ హాయిగా కూర్చుంటుంది. ఇంత చిన్న తప్పు రాత రాస్తే చాలు మా మేనేజరు నానా చివాట్లూ పెడతాడు. టైం ఏమాత్రం తప్పినా పెద్ద కేకవేస్తాడు. దానికి యివన్నీ వున్నాయా? ఏ పుస్తకం చదువుకుంటూనో, ఏ పువ్వులు గుచ్చుకుంటూనో కూర్చుంటుంది. అదృష్టం అంటే అలా వుండాలి. లక్ష జన్మాలకేనా ఆడ జన్మ ఇయ్యి భగవంతుడా!

* * *

భగవంతుడు వీరి ప్రార్థన లంగీకరించాడు శారదను రామంగానూ, రామాన్ని శారదగానూ మార్చివేశాడు.

* * *

ఆఫీసు గదిలో కూర్చున్న, రామం, వ్రాసే వ్రాసే కాగితా లక్కడపెట్టి టేబిలుపై బుర్ర ఆన్చి పడుకుని ఆలోచిస్తున్నాడు. అతనికి తను శారద అయ్యానన్న విషయం తెలియదు. ఇంతలో అయిదు 5 గంటలు కొట్టేరు. రామం వులిక్కిపడి లేచాడు. ఉన్నది గంట టైము, 10 పేజీల రికార్డు వ్రాయాలి. చేతి గాజులు ఘల్లుమన్నాయి. అతను ఆశ్చర్యంతో ఒళ్ళంతా తడుముకున్నాడు. ఇంకేముందీ - తను ఆడదయి పోయాడు!

అతనికి తనలో తనకే సిగ్గువేసింది. తన హేటు లేదు. తన చొక్కా లేదు. తన స్పెక్టికల్స్ లేవు. చీరా, జాకెట్టూ, పెద్ద జడా, ఛా, యివేమిటీ తనకు? ఎవరేనా చూస్తే...!

ఆ గది తలుపు వేసేసి వచ్చి కూర్చుని పక్కనున్న నిలువుటద్దంలో చూసుకున్నాడు. తన ఫ్రెంచి కట్ ఏదీ? తను యిలా ఎలా మారి పోయాడు- చాలా ఆశ్చర్యంగా వుందే? తను యీ స్వరూపంతో మేనేజర్‌కి కనపడితే యింకే మయినా వుందా! ఆఫీసుకి ఓ ప్రక్కతోవ వుంది, దానిగుండా ఎలాగో బయట పడ్డాడు.

దారిలో నడుస్తూంటే తను ఎప్పుడూ ఎరగని యిద్దరు అమ్మాయిలు ఎదురయి, "ఏమే, శారదా! ఈమధ్య మా యింటికి రావడం మానేశావేం?" అన్నారు. వారికేమీ జవాబు చెప్పకుండా యింటిదారి పట్టేడు. తను శారదలా మారిపోతే మరి శారద ఏమయినట్టు? శారద తనలా మారి పోలేదుకద! ఇంటికి వెళ్లి చూసేసరికి తన మాటే రైటయింది. తనలాంటివాడే (శారద కాబోలు) కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు. తనని చూడగానే గభుక్కున లేచాడు. ఒకర్నొకరు చూసుకొని, శారదా రామాలకి ఆశ్చర్యం పోయి నవ్వు వచ్చింది!

* * *

"నీ రూపు వచ్చినా, నాకు వంట తప్పదా? నేను చచ్చినా వండను" శారద యిలా ధిక్కరిస్తూంటే రామానికి ఒళ్లు మండిపోయింది. తన్ను నిత్యం గౌరవించి ఏమండీ అని పిలచే శారద

నువ్వనడంతో నే కోపం వచ్చింది. కోపం వచ్చి ఏం చెయ్యగలదూ ?

"నేను వంటలేనే..." అన్నాడు రామం జాలిగా.

"ఇదుగో సరిగ్గా మాట్లాడు. వండలేనే ఏమిటి ? నేను ఆడదాన్ని అనుకున్నావా? వండలేనండీ అనలేవూ ? నువ్వు నా భార్యవి. తెలిసిందా ?"

రామానికి చాలా అవమానం అనిపించింది. తన భార్య తనకి మొగుడా ? ఇది చాలా బాగుంది !

"ఏం, నన్ను ఏడిపించి నట్లుందదూ ? తొమ్మిదింటికి వంటవాలని నన్ను తినేసే వాడివే. ఏమయినాగాని తొమ్మిదికల్లా వంట అయితీరాలి. నేను ఆఫీసుకి వెళ్ళాలి. అదృష్టమో, దురదృష్టమో, నీ రూపం నాకూ, నా రూపం నీకూ వచ్చాయి. మామూలు కార్యక్రమం జరగవలసిందే !"

"శారదా, నీకు ఆఫీసు వ్యవహారాలు ఏం తెలుసు ? నామీద దయ వుంచు. నేను వండలేను."

"ఓహో, యిది చాలా బాగుంది. తొమ్మిది గంటలకల్లా హాయిగా ఆఫీసుకి వెళ్ళడ మను కున్నావా ? ఆ బాసదగ్గిర బాధపడి తీర వలిసిందే. ఇవాళకి నేను హోటల్లో తింటాను. నువ్వు వండుకుని తిను. నేను వెడుతున్నా."

"ఆఫీసులో కష్టాలు నీకూ తెలియవలసిందే వెళ్ళు వెళ్ళు." శారద (రామం రూపంలో) టకా టకా ఆఫీసుకి వెళ్ళిపోయింది.

"ఏమండోయ్ అమ్మగారూ, చింతపండు వేస్తారూ!" దాసీ మనిషి పెరట్లోంచి కేక వేసింది.

రామానికి శిరచ్ఛేద మయినట్లయింది. ఇంకే ముందీ, దాసీమనిషికూడా తనని ఆడదానికింద కట్టేసింది!

అది రెండుమూడుసార్లు పిలవడంచేత వంటింట్లోకి వెళ్ళింది. చింతపండు ఎక్కడుందో ఎన్ని వెదికినా కనపడలేదు.

"అమ్మగారూ, చింతపండు!"

"చింతపండు కనపడలేదే అమ్మా, అందాకా ఏ యినకతోనో తోమవే."

"అదేమి టమ్మగారూ, మీకే తెలీదూ ? గదుల పెట్టెలో వుండదూ ?" ఛీ—తనకంటే దాసీ దానికి ఎక్కువ తెలుసునా?

గదుల పెట్టెలో చింతపండు వుంది. ఈ పెట్టెలో చింతపండు వుందని ఎవరికి తెలుసూ? ఆఖరికి చింతపండు వేశాడు.

రామానికి పని అయే సరికల్లా ఆకలి ఎక్కువై పోయింది. ఏమైనా తిందామంటే డబ్బేదీ? బీరువాలో పర్సు వుండేది. తాళాలేవీ? తన కోటుజేబులో వుండేవి. తన కోటేదీ? శారదతో నే వెళ్ళిపోయింది. డబ్బులేదు కదా, శారద తను ఏం చేస్తాననుకుని వెళ్ళిపోయింది? శారదమీద చెప్పరానంత కోపం వచ్చేసింది. దానితో పాటు దుఃఖంకూడాను. తన కళ్ళమ్మట నీళ్ళు వస్తూంటే తనకే ఆశ్చర్యం వేసింది. తనకి పుట్టిన ఒక్కగానొక్క మోహన్ చచ్చిపోతేనే తనకి దుఃఖం లేదు. అప్పుడు శారద "మగ హృదయాలు కర్కశాలు" అంది. నిజమే. అన్నట్టు తనది యిప్పుడు స్త్రీహృదయం కదూ?

ఆకలీ, దుఃఖం రామానికి ఎక్కువై పోయాయి. ఓనాడు శారద "ఏమండీ, వాళ్ళు లక్ష్మి వాళ్లూ సినిమాకి వెడుతున్నారు. నన్నూ పంపరూ?" అని జాలిగా అడుగుతే తను ఎంతో కోపంగా "నువ్వు నాతో తప్ప ఎవ్వరితోనూ వెళ్ళడానికి వీలులేదు" అన్నాడు. శారద పాపం చిన్నబుచ్చుకొని "మీరు మీ స్నేహితులతో వెళ్ళవచ్చునా?" అని అడిగేసింది. తను అతి కోపంగా "నాయిష్టం నీ కెందుకూ" అని అరిచాడు.

అవును, అప్పుడు తనచేతిలో పర్సు వుండేది. తన యిష్టం, తనరాజ్యం, అందుకని సినిమాకేనా వెళ్లనియ్యలేదు. ఈనాడు తనే శారద అవుతా నని, శారద తనకి హోటల్లో తినడానికేనా డబ్బు ఇయ్యదని తెలిస్తే ఆనాడే శారదను గౌరవించే వాడేమో! చేసిన పాపం తప్పుతుందా?

11 గంటలు గంగణగంగుమని కొట్టడం రామం భావనా ప్రపంచంలోనుంచి లేపింది. ఆకలి చాలా బాధగావుంది. ఇక తప్పక వంట ఇంట్లోకి బయలుదేరాడు.

తను అలమారులోవున్న అగ్గిపెట్టె తీసుకొని ఎలాగో అతి కష్టపడి కుంపటి అంటించాడు. బియ్యంకడిగి కుంపటిమీద పెడితే వుడుకుతాయని ఓమారు శారద చెప్పింది. బియ్యం ఎక్కడున్నాయో? ఇల్లంతా వెతుకుతే ఆఖరికి మూల చిన్నబస్తాలో బియ్యం కనిపించాయి. అవి కొన్ని ఒక గిన్నెలో వేసుకొని అందులో నీళ్లుపోసి కుంపటిమీద పెట్టి విసురుతూ కూర్చున్నాడు. అవస్థ!

"ఇదిగో, ఏమో శారదా కొంచం నెయ్యి వుంటే యిస్తావుటో" ఓ అమ్మాయి పదహారేళ్లు వుంటాయేమో గుమ్మంలో నిలబడి అడుగుతోంది. ఈపిల్ల ఎవరు చెప్మా, శారద స్నేహితురాలు కాబోలు.

"మా యింట్లోనే నెయ్యిలేదు. ఇంకా కొందా మనుకొంటున్నానమ్మా" అని యాంత్రిగా జవాబు చెప్పేడు. ఆ పిల్ల వెళ్ళిపోయింది. అన్నం వుడికిపోయింది. ఇప్పుడు దీనిని ఏం చెయ్యాలి? అన్నట్టు వార్చాలి కదూ! ఓపళ్లెం తీసుకొని ఆ గిన్నెమీద పెట్టుకొని గంజి వారుస్తూ క్రింద నేమీ పెట్టకపోడంవల్ల కాలిమీద గంజి పడింది.

వేడివేడి గంజి పడిందేమో కాలు కాలిపోయింది. అబ్బా మంటమంట, గబగబా అలమారుతీసి యింత కొబ్బరినూనె రాసేడు. కొంత మంట చల్లారింది.

అన్నంలోకి ఏం వేసుకోను? ఆవకాయ అంటే తనకి తలనొప్పి. మరి ఎలాగ? రెండు వంకాయముక్కలు వేయించుకుంటే? బుట్టలో చిక్కుడుకాయలూ వంకాయలూ వున్నాయి. ఆ మాత్రం తరగలేనా అనుకొని వంకాయ ముక్కలు ఓముక్క పెద్దదీ, ఓముక్క చిన్నదీ తరుగుతూ ఎడంవేలు కొంచం కోసుకున్నాడు.

ఓవైపు చెయ్యి మంటా, ఇంకోవైపు కాలి మంటా రెండూ దంచాయి. వంకాయ ముక్కలు ఎలాగో తిరిగి మూకుడ్లో వేశాడు. వేసిన పావుగంటకి నూనె మాట జ్ఞాపకం వచ్చి అదో యింత పోశాడు. ఎలాగో కొంతసేపు వేగనిచ్చి దించి ఉప్పూకారం తన యిష్టంవచ్చినంత వేశాడు. అక్కడికి ముక్కలు అయ్యాయికదా !

తను పురుషుడయికూడా యిలా చేస్తున్నానా అని అహంకారం, పౌరుషం అతన్ని దంచాయి. కాని తను యిప్పుడు తను కాదే! పాపం యిలా వంటతో శారద రోజూ ఎంత బాధ పడేదో! అనుభవించేదాకా తెలుస్తుందా?

మజ్జిగ ఎక్కడేనా వుందేమోనని యిల్లంతా వెతికాడు. ఎక్కడా లేదు. ఎవరినేనా అడుగుతే! అవ్వను, ఈ వుపాయం బాగుంది.

మజ్జిగ గిన్నె పట్టుకుని బయలుదేరేడు. అడుగుతాడూ? పని మనిషిని పిలిచి "ఏమే, ఇందాక ఒచ్చిందే, ఆ అమ్మాయి యిల్లెక్కడే. ఆ అమ్మాయి పేరేమిటో?" అని అడిగేడు "అదేమి టమ్మగారూ కొత్తగా మాట్లాడుతున్నారు? లీలగారిల్లు ఈ ప్రక్కదేగా!" అంది.

బ్రతుకు జీవుడా అనుకొని ఆ యింటికివెళ్లి లీలగారూ! లీలగారూ! అని కేకవేశాడు. లీల బయటికొచ్చి "అదేమిటే శారదా ఆకొత్తమన్నన ఏమిటే?" అంది.

"ఏమీ లేదుగాని కొంచం పెరుగుంటే యిద్దూ" అన్నాడు. లీల గిన్నె పుచ్చుకొని "యిందవే శారదా!" అని నిండా పెరుగుతో యిచ్చింది. బతికాంరా బాబూ అనుకొని పెరుగు గిన్నె పట్టుకొని యింటికి మరలేడు రామం.

ఇంట్లోకి వచ్చి పీటా విస్తరీ వేసుకొని ఆ ఉడికీ ఉడకని అన్నం, నూనె కారుతూన్న వేగని ముక్కలూ వేసుకొని తింటూ.—

వంట వండడం, ఇంత కష్టమనుకోలేదు. ఈ పని నేను అనుకున్నంత సుఖంకాదు. ఈ జన్మ కంటే హాయిగా ఎన్ని చివాట్లుతిన్నా ఆఫీసుకి వెళ్ళడమే మేలు. వెయ్యి జన్మాలకేనా మొగ జన్మ ఇయ్యి దేముడా!

* * *

ఓసారి తన మొగుడు తనను ఆఫీసుకి తీసుకు వచ్చాడు. కనుక శారద అతి ధైర్యంగా వెళ్లి తన రూములో కూర్చుంది. ఇంతలో ఒక ప్యూన్‌వచ్చి "అదేమిటి రామంగారూ! అటెండన్సు వేయించుకోలేదేమిటి?" అన్నాడు. శారద తెలివైందికనుక లేచి వానితో వెళ్లి ఎటండెన్సు వేయించుకొనివచ్చి రూంలో కూర్చుంది. ఏం చెయ్యాలో ఏమీ తోచలేదు. ఇంతట్లో ఒక గుమాస్తావచ్చి "రామంగారూ,

యింటిగో ఈ కాగితాలు టైపు చెయ్యాలి అని యిచ్చి వెళ్ళిపోయాడు. శారదకు టైపు రాదు ఎలాగ? ఇంతలోకి మేనేజరు వచ్చి—

"ఏమయ్యా రామం! ఇంత లేటుగావచ్చి కూడా నీకు ఒకడు చెప్పేదాకా అటెండెన్సు వేయించుకోవాలన్న జ్ఞాపకం లేకపోయిందా? ఎన్నిసార్లు చెప్పినా మీరంతే. యింకా అలా చూస్తావేం? టైపు చెయ్యక?" అంటూ వెళ్లిపోయాడు. ఆ టైపు ఎలా చెయ్యడమో శారదకి తెలియలేదు. అలా ఆలోచిస్తూ కూర్చుంది రామం ఎలా వండుకుంటున్నాడో అని! తను హోటలులో భోంచేసిందే కాని రామం ఎలా తింటాడు! అలా ఆలోచిస్తూ వుండగా 11 గంట లయింది. ఇందాకట వచ్చిన గుమాస్తాయే మళ్లీ వచ్చి,

"అదేమిటిసార్ అలా కూర్చున్నారు. టైపు చెయ్యలేదా? మేనేజరుగారు తెమ్మంటున్నారే" అన్నాడు.

శారద తొట్రుపడుతూ లేచింది.

ఇంతలో ఒకప్యూన్ వచ్చి "రామంగారూ, మిమ్మల్ని మేనేజరుగారు రమ్మంటున్నారు" అన్నాడు.

శారద కంగారుపడుతూ వెళ్లింది.

"ఏమయ్యా, రామారావ్ టైపు చెయ్యలేదా."

"చిత్తం, లేదండి."

"సిగ్గులేదూ ఆ మాట చెప్పడానికి? ఈ రెండుగంటలూ వృథా యేనా? మనిషన్న వాడికి బుద్ధుండాలి! ఇంతసేపూ ఏం చేస్తున్నావ్? మాట్లాడవేం బెల్లం కొట్టిన రాయిలాగ. ఇలాంటి వాళ్లుంటే పనులు జరిగినట్టే. ఇప్పటికేనా వెళ్లు."

చేతులు నులుపుకుంటూ శారద తిరిగి గదిలో ప్రవేశించింది. ఈ ఆఫీసుపని కాగితం మీద సంతకం పెట్టడమే గాని యింత కష్టమనుకో లేదు ఈ చీవాట్లూ చెప్పుదెబ్బలూ నేను పడలేను. లక్ష జన్మాలకేనా యీ మగజన్మ వద్దు భగవంతుడా!

* * *

భగవంతుడు దయాపూరితుడు. వారి కోర్కెలను మళ్లీ తీర్చేడు. శారద శారద గానూ, రామం రామం గానూ మారిపోయేరు!

* * *

అన్నం తింటున్న రామం చేతి గాజులు గబుక్కుని మారిపోయాయి. తిరిగి తన పంట్లామూ షర్టూ తన ఫ్రెంచికట్! అతి సంతోషంతో చెయ్యి కడుక్కుని అద్దం చూసుకున్నాడు- అబ్బా ఎంత అదృష్టం!

ఇంతలో శారద గబగబా పరుగెత్తుకు వచ్చి రామం చేతుల్లో వాలిపోయింది!

"మీకెంత కష్టం వుందని తెలీదు. నన్ను క్షమించరూ!"

"ముందు నన్ను క్షమించు. నిన్నెంతగా బాధించాను?"


ఈ క్రింది ఊళ్లలో ఇంగ్లీషు, తెలుగు 'స్వతంత్ర' పత్రికలు అమ్ముటకు

ఏజెంట్లు కావలెను:

అమలాపురం, చోడవరం, బళ్లారి, శృంగవరపుకోట,
కైకలూరు, పొన్నపల్లి అగ్రహారం

వివరములకు :—

మేనేజరు, 'స్వతంత్ర',
160 లాయిడ్స్ రోడ్,
రాయపేట- మదరాసు-14.